నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, గురువారం 20 మార్చి 2025 | YADADRI BHUVANAGIRI



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భాస్కర్‌రావు, భగత్‌కుమార్

## రేవంత్ పాలనను ఛీ కొడుతున్న జనం

- బీఆర్ఎస్ అంటేనే అభివృద్ధి, కాంగ్రెస్ అంటే అబద్ధం
- రైతు గోస పట్టని కాంగ్రెస్ ప్రభుత్వం
- సర్కారుపై సొంత పార్టీ ఎమ్మెల్యేల అసంతృప్తి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

కొండమల్లేపల్లి, మార్చి 19 : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా పథకాలు అమలు చేయకపోవడంతో ప్రజలు రేవంత్‌రెడ్డి పాలనను ఛీ కొడుతున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు రైతు భరోసా, రుణమాఫీ చేస్తామని బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చాక రైతులకు మేలు చేయడం లేదన్నారు. రుణమాఫీ పూర్తి చేయలేదని, రైతు భరోసా మొక్కుబడి ఇస్తున్నారని, ఉచిత విద్యుత్ 10 గంటలు కూడా వస్తలేదని, అది కూడా లోఓల్టేజీతో వస్తుందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఒక పిల్లర్ కూలితే దాన్ని రిపేర్ చేయించి రైతులకు నీళ్లు ఇవ్వాల్సి ఉండగా కేసీఆర్‌కు ఎక్కడ పేరు వస్తుందోననే దుర్బుద్ధితో రేవంత్‌రెడ్డి సాగునీళ్లు ఇవ్వకుండా పొలాలు ఎండబెడుతున్నారని మండిపడ్డారు. నాగార్జునసాగర్‌లో నీటి నిల్వలు తగ్గాయని, ఆంధ్రాకు నీళ్లు తరలించుకుపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వం, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుపై పెత్తనం చెలాయిస్తున్నాడని అన్నారు. వాటాకు మించి ఆంధ్రాకు నీళ్లు తీసుకు పోతున్నా జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు అడిగే దమ్ములేదని విమర్శించారు. పరిస్థితి ఇట్లనే ఉంటే రేపు హైదరాబాద్‌కు కూడా తాగునీళ్లు దొరకని పరిస్థితి వస్తుందని అన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు చరిత్రలో వరుసగా 17 పంటలకు నీళ్లు ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు. ఒకవైపు భూగర్భ జలాలు అడుగంటి, మరోవైపు చాలీచాలని కరెంటుతో పంటలకు నీళ్లందక ఎండిపోతుంటే దిక్కుతోచని పరిస్థితుల్లో కడుపుమండి రైతులు రోడెక్కి అందోళనలు చేస్తున్నారని అన్నారు. సర్కారుపై సొంత పార్టీ ఎమ్మెల్యేలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, నోముల భగత్, బీఆర్ఎస్ కొండమల్లేపల్లి మండలాధ్యక్షుడు రమావత్ దస్రూ నాయక్, రైతు బంధు సమితి మాజీ మండలాధ్యక్షుడు కేసాని లింగారెడ్డి, యువజన అధ్యక్షుడు రమావత్ తులసీరాం నాయక్, రావుల వెంకటయ్య, పెద్దిశెట్టి సత్యం, వరికుప్పల పాండు, తోటపల్లి శ్రీను, శేఖర్ యాదవ్, ఎస్కే బషీర్, దాచేపల్లి నరేందర్, తోటపల్లి వెంకటేశ్వర్లు, వెంకటయ్య, పేట రమేశ్ ఉన్నారు.



చిన్నతుమ్మలగూడెంలో ఎండిన వరి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

## కాంగ్రెస్ అసమర్థ పాలనతో రైతులకు కష్టాలు


- ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంటలు ఎండిపోతున్నాయి
- ఎండిన పంటలకు ఎకరాకు రూ. 50వేల నష్టపరిహారం ఇవ్వాలి
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, మార్చి 19 : రాష్ట్రంలో కాంగ్రెస్ అసమర్థ పాలనలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని, వ్యవసాయం సంక్షోభంగా మారిందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నార్కట్‌పల్లి మండలంలోని నెమ్మాని, జువ్విగూడెం, చిన్నతుమ్మలగూడెం గ్రామాల్లో బుధవారం ఆయన ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట పశువులకు మేతలా మారిందని, మోటార్లు కాలిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు చిరుమర్తి దృష్టికి తీసుకొచ్చారు. ఆయనతో కన్నీరు మున్నీరై తమ బాధలు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ ఇప్పటివరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పంట పొలాలు ఎండిపోయాయని, రైతులు ధైర్యం కోల్పోయి అప్పుల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కారు అవగాహన రాహిత్యంతో చేతికొచ్చిన పొలాలు ఎండిపోయాయని మండిపడ్డారు. ఎకరానికి దాదాపు రూ.35,000 ఖర్చు చేసిన రైతుకు పంటలు ఎండాయని, పంట నష్టపోయిన రైతుకు ఎకరానికి రూ. 50వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సాగర్ నుంచి నీళ్లు ఆంధ్రాకు తరలించకుండా తెలంగాణ రైతాంగానికి అందించాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో పూర్తి చేసిన బ్రాహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టును ప్రారంభించి తామే చేశామని గొప్పలు పలుకడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నార్కట్‌పల్లి మండలాధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్ రెడ్డి, రైతు బంధు సమితి మాజీ మండల కన్వీనర్ యానాల అశోక్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు మేకల రాజిరెడ్డి, చిరుమర్తి యాదయ్య, దుబ్బాక శ్రీధర్, మాజీ సర్పంచ్‌లు బొక్క భూపాల్ రెడ్డి, కొత్త నర్సింహ, బీఆర్ఎస్ నాయకులు బత్తుల అనంతరెడ్డి, బురుగె ఎల్లేశ్, కృష్ణ, భిక్షం, వెంకటయ్య, సైదులు, నిఖిల్, ప్రతాప్‌రెడ్డి, యాదయ్య, శ్రీనివాస్ రెడ్డి, ఫకీర్ సత్తిరెడ్డి ఉన్నారు.

ఉద్యమాల పురిటి గడ్డ.. ఎందరో ఉద్దండులైన ఉద్యమకారులకు పుట్టిల్లు అయిన సూర్యాపేట తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఎగిరిన గులాబీ జెండాను మొదటి నుంచీ గుండెలకు అత్తుకున్నది. ప్రత్యేక రాష్టమే శ్వాసగా, ధ్యాసగా సాగిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రతి అడుగుకూ మద్దతు పలికి కదం తొక్కింది. నాడు ఉద్యమ సారథిగా అయినా, ఆ తర్వాత స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రిగా అయినా కేసీఆర్ మదిలో సూర్యాపేటకు ప్రత్యేక స్థానం ఉంది. అందుకే ఆయన అనేక చరిత్రాత్మక కార్యక్రమాలకు ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ 27న బీఆర్ఎస్ పార్టీ 25వ వసంతంలోకి అడుగిడుతున్న నేపథ్యంలో వరంగల్ లో తలపెట్టిన రజతోత్సవ సభ విజయవంతానికి నిర్వహించనున్న సన్నాహక సమావేశాల ప్రారంభానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సూర్యాపేటనే ఎంచుకోవడం విశేషం. ఈ మేరకు ఆయన గురువారం సూర్యాపేటకు రానున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ పార్టీ జిల్లా స్థాయిలో ముఖ్య కార్యకర్తలతో సమావేశమై దిశానిర్దేశం చేయనున్నారు.

# పాతికేండ్ల వేడుకకు సూర్యాపేట నుంచే నాంది

### నేడు సూర్యాపేటకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాక



బీఆర్ఎస్ రజతోత్సవ సభ సక్సెస్‌కు సన్నాహక సమావేశం

- జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తలతో భేటీ..
- భారీ ర్యాలీతో ఘన స్వాగతం పలికేందుకు గులాబీ శ్రేణులు సన్నద్ధం
- ఉద్యమాలకైనా.. అభివృద్ధికైనా పేటకు ప్రత్యేక స్థానం
- మాజీ సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలకు ఇక్కడి నుంచే శ్రీకారం
- 2012లో మ్యానిఫెస్టో ప్రకటించింది సమరభేరీ సభ నుంచే..

సూర్యాపేట, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యమ సమయంలోనైనా, కొట్లాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో అయినా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సూర్యాపేట జిల్లా నుంచి అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నాగార్జునసాగర్ ఆయకట్టు రైతులకు సాగు నీరు ఇవ్వాలని 2002లో కోదాడ నుంచి నాగార్జునసాగర్ వరకు పాదయాత్ర చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని అణగదొక్కాలనే కుట్రకు తెరలేపి బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలను లాక్కున్న నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల్లో ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష లేదంటే.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉద్యమ రథసారథిగా ఊరూరూ తిరిగి తెలంగాణ ఆకాంక్షను ఎలుగెత్తి చాటారు. 2006లో పల్లెబాటతో చేపట్టిన ఈ పాదయాత్రను ఉద్యమం నాటి నుంచి ఆయనకు అత్యంత సన్నిహితుడిగా మెలిగిన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి స్వగారం నాగారం నుంచే మొదలు పెట్టారు. ఉద్యమ సమయంలో పోరాటానికి ఊపిరిలూదుతూ హైవే దిగ్బంధనాలతో సూర్యాపేట ఎంతో స్ఫూర్తిని నింపింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దోఖాలకు బుద్ధి చెప్పేందుకు 2012లో కనీవిని ఎరుగని రీతిన లక్షలాది మందితో కేసీఆర్ సూర్యాపేటలో సమరభేరి సభ నిర్వహించారు. పార్టీ మ్యానిఫెస్టోను సైతం ఇక్కడి నుంచే ప్రకటించారు. మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుడు యాసంగిలో రాష్ట్రవ్యాప్తంగా వరి పంటలు ఎండిపోతున్నా కనీసం స్పందించకపోవడంతో ప్రతిపక్ష నేతగా తొలి సారి సూర్యాపేట జిల్లా నుంచే కేసీఆర్ కరువు యాత్రను ప్రారంభించి రైతుల పక్షాన నిలిచారు.

### రజతోత్సవ సభ విజయవంతం కోసం

బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్ని జిల్లాల పర్యటనకు సిద్ధం కాగా, తొలి సమావేశానికి సూర్యాపేటనే ఎంచుకున్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో జరుగనున్న పార్టీ జిల్లా స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా కేటీఆర్ హాజరై దిశానిర్దేశం చేయనున్నారు. జనగాం క్రాస్‌రోడ్డు వద్ద పనులు జరుగుతున్నందున నేరుగా కొత్త బస్టాండ్ వద్దకు కేటీఆర్ చేరుకోనున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయానికి వస్తారు. ఉదయం 11.30 గంటలకు సన్నాహక సమావేశం వేదిక మీదకు చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమావేశం జరుగనుంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఏమాత్రమూ ఆశాజనకంగా లేకపోవడం, రాష్ట్రవ్యాప్తంగా లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నా సర్కారు పట్టించుకోకపోవడంపై సమావేశంలో చర్చించడంతోపాటు పార్టీ ప్రస్థానాన్ని కేటీఆర్ మరోసారి గుర్తుచేసే అవకాశం ఉంది. వాటితోపాటు పార్టీ నిర్మాణంపైనా మాట్లాడే చాన్స్ ఉంటుంది. సమావేశం అనంతరం ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మధ్యాహ్న భోజనం చేసి తిరుగు ప్రయాణం కానున్నారు. సమయాన్ని బట్టి సూర్యాపేట సమీపంలో ఎండిన వరి పంటను పరిశీలించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో గురువారం నాటి కేటీఆర్ పర్యటన ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంది. సన్నాహక సమావేశం విజయవంతం కోసం జగదీశ్‌రెడ్డి రెండు రోజులుగా నియోజవకర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు.



### సూర్యాపేట చరిత్ర సృష్టించబోతున్నది

టీఆర్ఎస్‌గా ఉన్నా, బీఆర్ఎస్‌గా మారినా అనేక ఉద్యమాలు, అభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలిచిన సూర్యాపేట మరో చరిత్ర సృష్టించడం ఖాయం. సూర్యాపేట కేంద్రంగా జరిగిన అనేక పోరాటాలు తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తును లేవడానికి దోహదపడ్డాయి. రాష్ట్రఆవిర్భావం అనంతరం అనేక కార్యక్రమాలకు కూడా ఇక్కడి నుంచే అంకురార్పణ జరిగింది. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత కేసీఆర్‌కు సూర్యాపేటపై ఉన్న అభిమానం, నమ్మకం, సెంటిమెంట్‌ను గౌరవిస్తూ కేటీఆర్ రజతోత్సవ సంబురాల నాందికి సూర్యాపేటను ఎంచుకోవడం సంతోషకరం. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్‌కు కూడా సూర్యాపేటతో ఎంతో అనుబంధం ఉంది. ఆయన రాజకీయాల్లోకి వచ్చిన తొలిరోజుల్లో వర్ధమానుకోటలో జరిగిన తెలంగాణ ఉద్యమ సభలోనే తొలి ప్రసంగం చేశారు. ఇప్పుడు రజతోత్సవ సభ విజయవంతం కోసం రాష్ట్ర వ్యాప్తంగా జరిగే సన్నాహక సమావేశాల్లో భాగంగా తొలి సమావేశానికి సూర్యాపేటను ఎంచుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు, ఇచ్చిన హామీల అమలుకు రానున్న రోజుల్లో జరిగే ఉద్యమాలకు సూర్యాపేటనే నాంది పలకడం ఖాయం.


-గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే

### రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కూడా..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పేదల సొంతింటి కలను నెరవేర్చే డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పథకానికి ముఖ్యమంత్రిగా కేసీఆర్ సూర్యాపేట నుంచే శ్రీకారం చుట్టారు. స్థానిక గొల్లబజారులో నాటి మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయానికి శంకుస్థాపన చేశారు. ఏడాది వ్యవధిలో ప్రారంభోత్సవం కూడా చేశారు. అంతేగాక కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం తొలి ఫలితం సూర్యాపేటకు దక్కింది. సూర్యాపేట ప్రజలు సైతం అన్నీ మననంలో ఉంచుకుంటూ వరుసగా మూడుసార్లు బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దిగిన జగదీశ్‌రెడ్డిని గెలిపించి కేసీఆర్‌కు సూర్యాపేటపై ఉన్న అభిమానాన్ని రెట్టింపు చేశారు.

# ఈసారీ నిరాశే

## ఉమ్మడి జిల్లా ఆశలపై నీళ్లు చల్లిన బడ్జెట్



- సాగునీటి ప్రాజెక్టులపై నీలినీడలు
- సొరంగ మార్గం పూర్తికి అదనపు నిధులు కరువు
- బ్రాహ్మణవెల్లంల, ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వలకు కేటాయింపుల్లేవ్
- ఎడమ కాల్వ ఎత్తిపోతల ప్రస్తావనే లేదు
- మిగిలిన రుణమాఫీకి నిధుల్లేవ్
- రైతు భరోసా కేటాయింపులపైనా అనుమానాలు
- విద్య, వైద్య రంగాలకూ అరకొర నిధులే
- ఆరు గ్యారెంటీల అమలు ఇప్పట్లో లేనట్లేనా?
- రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులపై ఉమ్మడి జిల్లా ప్రజల మండిపాటు

నల్లగొండ ప్రతినిధి, మార్చి19(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో బుధవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉమ్మడి జిల్లా ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసింది. కీలకమైన సాగునీటి ప్రాజెక్టులతోపాటు ఇతర పథకాలకు సైతం అరకొర నిధులు కేటాయించడంపై విపక్ష, ప్రజాసంఘాల నేతలు, వివిధ రంగాల ప్రముఖులు అసంతృప్తిని వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ పెద్దల మాటలు కోటలు దాటుతున్నా... చేతలు గడప దాటడం లేదన్నట్లు కేటాయింపులు ఉన్నాయని మండిపడుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ మూడేండ్లలో పూర్తి చేస్తామని వేదికలపై గొప్పలకు పోతున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిధుల సాధనపై మాత్రం శ్రద్ధ పెట్టలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నా ప్రాజెక్టులకు కేటాయింపుల్లో ఆయన మార్క్ లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. మిగిలిపోయిన రైతులకు రుణమాఫీకి సంబంధించి నిధుల ప్రస్తావన లేకపోవడంతో ఆశలు వదులుకోవాల్సిందేనన్న సందేహాలు మొదలయ్యాయి. రైతుభరోసాకు ప్రభుత్వం చేసిన కేటాయింపులు చూస్తే అందరికీ ఇచ్చేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బడ్జెట్ లెక్కలు చూస్తే ఆరు గ్యారెంటీల అమలు కూడా ప్రశ్నార్థకంగా మారింది. కీలకమైన విద్య, వైద్య రంగాలకు ప్రత్యేక కేటాయింపులు లేకపోవడం పట్ల ఉమ్మడి జిల్లా ప్రజలు మండిపడుతున్నారు.

### సాగునీటి ప్రాజెక్టులకు అరకొరగా...

ఉమ్మడి జిల్లా పరిధిలో మూడు ప్రాజెక్టులు ఇరిగేషన్ సర్కిల్స్‌లోకి వస్తుండగా వీటిన్నింటినీ కలిపి పరిశీలించినా కేటాయింపులు అరకొరగానే ఉన్నాయి. సూర్యాపేట సీఈ సర్కిల్ పరిధిలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో దశకు నిధుల కేటాయింపులు గతంలో మాదిరిగా రూ.34.01కోట్లే ఉంది. మూసీకి సంబంధించి గతంలో రూ.64కోట్లు ఉంటే ఈసారి రూ.50 కోట్లకు తగ్గించారు. నల్లగొండ సీఈ సర్కిల్ పరిధిలో ఏఎమ్మార్పీ కోసం రూ.899 కోట్ల కేటాయింపులు చూపారు. గతంతో పోలిస్తే వంద కోట్లు అదనంగా కనిపిస్తున్నా ప్రభుత్వం చెప్తున్న ప్రకారం దీని పరిధిలోని ప్రాజెక్టులు మూడేండ్లలో పూర్తి కావాలంటే ఎలా సరిపోతాయన్నది తేలాల్సి ఉంది. ఇందులోనే కీలకమైన ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గంతోపాటు పెండ్లిపాకల రిజర్వాయర్, లింక్ కెనాల్ పనులన్నీ చేపట్టాల్సి ఉంది. టన్నెల్ ఇన్‌లెట్ వైపు కూలిన సొరంగ మార్గం పరిస్థితి ఏంటనేది స్పష్టత లేదు. ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వతో పాటు డ్రిస్టిబ్యూటరీ కాల్వల లైనింగ్ పనులను రూ.600 కోట్లతో చేపట్టి ఆరు నెలల్లోనే పూర్తి చేస్తామని గత వారమే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. మొత్తం కేటాయింపులే రూ.899 కోట్లు అయితే ఇవన్నీ ఎలా సాధ్యమనేది మంత్రులే చెప్పాల్సి ఉంది. దీని పరిధిలోకే వచ్చే బ్రాహ్మణవెల్లంల ఎత్తిపోతల పథకంలో కీలకమైన భూసేకరణతోపాటు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ తవ్వకానికి కనీసం రూ.200 కోట్లు తక్షణం అవసరం ఉన్నట్లు అంచనా. ఆ కేటాయింపులపైనా స్పష్టత లేదు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వతోపాటు కృష్ణానదిపై నిర్మిస్తున్న 14 ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన ప్రస్తావన ఎక్కడా లేదు. గజ్వేల్ సీఈ సర్కిల్ పరిధిలోకి వచ్చే ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాల్వల పరిపాలన అనుమతుల గురించి మంత్రి భట్టి విక్రమార్క తన ప్రసంగంలో ప్రస్తావించినా నిధుల కేటాయింపు మాత్రం లేదు. ఇదే సర్కిల్ పరిధిలోని కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో రూ.2,699 కోట్ల కేటాయింపులు కనిపిస్తున్నా ఇందులో యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని బస్వాపురం, గంధమల్ల రిజర్వాయర్ల నిర్మాణం, కాల్వలు, ఇతర పనుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావన లేకపోవడం గమనార్హం.

### మిగిలిన రుణమాఫీ సంగతి అంతేనా?

ఉమ్మడి జిల్లా పరిధిలో రుణమాఫీ 60 శాతానికి మించి కాలేదన్నది వాస్తవం. 5.50 లక్షల మంది రుణమాఫీకి అర్హులైన రైతులు ఉండగా 3.85లక్షల మందికే రుణమాఫీ జరిగింది. మిగతా లక్షన్నర మందికి పైగా రైతులు రుణ మాఫీ కోసం ఏడు నెలలుగా ఎదురు చూస్తూనే ఉన్నారు. ఈ బడ్జెట్‌లోనైనా ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తే రుణమాఫీ అవుతుందని రైతులు భావించారు. మిగిలిన రుణమాఫీ గురించి ప్రస్తావనే లేకపోవడంతో ఆశలు వదులు కోవాల్సిందేనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రైతు భరోసా నిధుల కేటాయింపు కూడా పలు అనుమానాలకు తావిస్తున్నది. ప్రభుత్వం కేటాయించిన నిధులతో ఉమ్మడి జిల్లాలో గతంలో కంటే భారీగా కోతలు పడొచ్చని రైతుసంఘాల నేతలు అంచనా వేస్తున్నారు. వానకాలం సన్నాలు పండించిన ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతులకు ఇవ్వాల్సిన బోనస్ డబ్బులకు కూడా కేటాయింపులు జరుగలేదు. దాంతో ఉమ్మడి జిల్లాలో రూ.47.95 కోట్ల బోనస్ ప్రశ్నార్థకంగా మారింది.

### రహదారుల విస్తరణ ఎప్పటికో!

జిల్లాకు చెందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిగా ఉన్నా ఆయన మార్క్ బడ్జెట్‌లో కనిపించ లేదు. జిల్లాలో అత్యంత సమస్యాత్మక రోడ్లుగా ఉన్న చిట్యాల-భువనగిరి, నల్లగొండ-కొండమల్లేపల్లి రహదారుల విస్తరణ పనులపై ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. కానీ వీటి ప్రస్తావన లేకపోవడం తీవ్ర నిరుత్సాహానికి గురిచేసింది. మండల కేంద్రాల మధ్య, ప్రధాన గ్రామాల మధ్య అనేక రోడ్లు విస్తరించాల్సి ఉన్నా, వాటికి నిధుల్లేవు. అధికార కాంగ్రెస్ నేతలు మినహా బీఆర్ఎస్‌తోపాటు మిగతా విపక్ష నేతలు, ప్రజాసంఘాల నేతలంతా ఈ బడ్జెట్ ఆశాజనకంగా లేదని, కేవలం అంకెల గారడీని తలపిస్తున్నదని విమర్శలు గుప్పించడం గమనార్హం.

### వైద్య, విద్య మౌలిక వసతుల కల్పన ఏది?

గత కేసీఆర్ ప్రభుత్వం విద్య, వైద్యరంగాలతోపాటు పట్టణాలు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు వేల కోట్ల రూపాయలు కేటాయిస్తూ పెద్ద పీట వేసేది. రేవంత్ సర్కార్ వీటి పట్ల నిర్లక్ష్యంగా ఉన్నట్లు బడ్జెట్ కేటాయింపులు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాకు కొత్తగా ఒక్క విద్యాలయం గానీ, వైద్య రంగంలో ప్రత్యేక ఏర్పాట్లు గానీ బడ్జెట్‌లో కనిపించ లేదు. యాదాద్రి మెడికల్ కాలేజీ ఊసేలేదు. జిల్లా కేంద్ర ఆస్పత్రుల విస్తరణకు నిధుల కేటాయింపులు లేవు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ భవనాలను ప్రస్తావించినా ప్రత్యేకంగా నిధుల కేటాయింపు కనిపించ లేదు.


### ప్రజలను మభ్యపెట్టే బడ్జెట్



రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడిగా ఉంది. గత సంవత్సరం వ్యవసాయ రంగానికి రూ.49 వేల కోట్లు కేటాయించగా, ఇప్పుడు రూ .24.439 కోట్లు మాత్రమే ప్రకటించారు. ఈ నిధులతో వ్యవసాయ రంగానికి ఎలా మేలు జరుగుతుంది. రైతు భరోసా కింద రూ.18 వేల కోట్లు కేటాయించినట్లు చెప్పి రూ.3,400 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణ కోసం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. గృహ జ్యోతి కింద 50 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెబుతున్నా.. కనీసం 25లక్షల కుటుంబాలకు కూడా మేలు జరుగడం లేదు. 43లక్షల కుటుంబాలకు వంట గ్యాస్ రూ.500లకే ఇస్తున్నామంటున్నా అది 25లక్షల కుటుంబాలకు కూడా వర్తించడం లేదు. ప్రజలను మభ్య పెట్టేందుకు అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెబుతున్న అబద్ధాలను అందరూ గమనిస్తున్నారు.

- కంచర్ల రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు(మోత్కూరు)

### బడ్జెట్‌లో నేతన్నలకు మొండి చెయ్యి



చేనేత, పవర్‌లూం, పరిశ్రమ కార్మికుల అభివృద్ధి కోసం 2025 -26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మొండి చెయ్యి చూపించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేనేతకు బడ్జెట్‌లో రూ.1283 కోట్లు కేటాయించగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు 371 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకొంది. హామీలు అమలు కావాలంటే 2000 కోట్ల రూపాయలు కేటాయించాల్సి ఉంది. ఇప్పటికే రాష్ట్రంలో కార్మికులకు ఉపాధి లేక 36 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది.

- కూరపాటి రమేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేనేత కార్మిక సంఘం(భూదాన్‌పోచంపల్లి)

### ఇది నయవంచక బడ్జెట్



ఇది నయవంచక బడ్జెట్. దీనిలో అంకెల గారడి తప్ప పస లేదు. ఈ బడ్జెట్‌తో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా ప్రజా విశ్వసనీయత పూర్తిగా కోల్పోయ్యింది. హామీలను అమలు పర్చే విధంగా నిధుల కేటాయింపు జరుగలేదు. ఆరు గ్యారెంటీల అమలుకు మంగళం పాడుతున్నట్లు చెప్పకనే చెప్పారు. మహిళలకు మహాలక్ష్మి పథకం కింద రూ.2,500 ఊసే లేదు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు నెలకు 4 వేల రూపాయల పింఛన్ మాటేలేదు. ప్రజలు ఆశతో కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మోసం చేశారు. ఈ బడ్జెట్‌తో కాంగ్రెస్ దివాళాకోరుతనం మరోసారి బయటపడింది.

- ఎంసీ కోటిరెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, ఉమ్మడి నల్లగొండ జిల్లా

### బీసీలకు ఏటా రూ. 20 వేల కోట్ల బడ్జెట్ ఏమైంది



ప్రతి వార్షిక బడ్జెట్‌లో బీసీలకు రూ. 20 వేల కోట్ల నిధులకు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇందుకు భిన్నంగా రూ. 10 వేల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం దారుణం. ఉత్పత్తి కులాలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. మహిళకు నెలకు రూ. 2,500 భృతికి నిధులు కేటాయింపు లేదు. తులం బంగారం ప్రస్తావనే లేదు. రైతు భరోసాకు అరకొర బడ్జెట్‌ను కేటాయించి చేతులు దులుపుకున్నారు. రెండు దఫాలుగా రైతు భరోసా పెండింగ్‌లోనే ఉంది. రుణమాఫీ పూర్తి చేయలేదు. బీఆర్ఎస్ పార్టీ తరపున తప్పుల బడ్జెట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడతాం.

- మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్(యాదగిరిగుట్ట)